దేశాభివృద్ధిలో అకౌంటెంట్స్ పాత్ర కీలకం

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

వేడుకలను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.

ఖైరతాబాద్, జనవరి 5 : దేశాభివృద్ధిలో కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ పాత్ర ఎంతో కీలకమైందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఎంఏ) హైదరాబాద్ చాప్టర్ స్వర్ణోత్సవ వేడుకలను ఐసీఎంఏ చైర్‌పర్సన్ డాక్టర్ లావణ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాస ప్రసాద్, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు కేసీహెచ్‌ఎవీఎస్‌ఎన్ మూర్తితో కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. భారత ఆర్థిక స్థిరత్వం, గోల్బల్ పోటీలకు మూలస్తంభం మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ అని పేర్కొన్నారు. భారత్ ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడంపై దృష్టి పెట్టిందన్నారు.

6 నుంచి ఉచిత సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్

బంజారాహిల్స్, జనవరి 5: ప్రపంచ సర్వైకల్ క్యాన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో జనవరి 6 నుంచి 31 వరకు ఉచిత స్క్రీనింగ్ శిబిరం నిర్వహించనున్నారు. ప్రతి రోజూ ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆస్పత్రిలోని బ్లాక్-1 మొదటి అంతస్తులోని సర్జికల్ విభాగంలో ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తామని ఆస్పత్రి వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. క్యాన్సర్ నివారణ, చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని, క్యాన్సర్ ప్రాథమిక లక్షణాలు నిర్ధారించడంతోపాటు అవసరమైన వారికి రాయితీతో పాప్ స్మియర్, ఇతర పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఇదేమి ప్రజా ప్రభుత్వం..!

- కారు దిగరు.. జనం గోడు పట్టించుకోరు
- ఖైరతాబాద్ ప్రజాప్రతినిధుల తీరుపై స్థానికుల అసహనం

ఖైరతాబాద్, జనవరి 5 : ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి.. వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారం మార్గం చూపాలి. కానీ ప్రజా ప్రభుత్వంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల శైలీ అందుకు భిన్నంగా కనిపిస్తున్నది. ఖైరతాబాద్ డబుల్ బెడ్రూమ్ గృహ సముదాయానికి గత నెలలో తీవ్ర తాగు నీటి ఎద్దడి ఎదురైంది. దాంతో గృహ యజమానులు అనేక ఇబ్బందులు పడ్డారు. రెడ్ హిల్స్ వద్ద పైపులైన్ లీకేజీతో ఈ సమస్య నెలకొన్నా అధికారులు ఆలస్యంగా స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో వారి కష్టాలు వర్ణణాతీతం. స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ డబుల్ బెడ్రూమ్ గృహ సముదాయానికి పవర్ బోరు వేయిస్తానని హామీ ఇచ్చి ఏడాది అవుతున్నా పట్టించుకోవడంలేదని గృహ యజమానులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు డబుల్ గృహ యజామానులు సమస్యలను వివరించారు. రేపు, మాపు అంటూ ఎమ్మెల్యే వెళ్లిపోవడంతో వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఏడాది కాలంగా అదే డైలాగ్ చెబుతున్నారని, ఎన్నికల ముందు ఓట్ల కోసం తిరిగిన ఆయన ఎమ్మెల్యే అయ్యాక కనీసం తమ గోడును వినేందుకు కారు సైతం దిగడంలేదని 2 బీహెచ్‌కె డిగ్నిటీ హౌజింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్ వాపోయారు. కాగా, అదే దారిలో కారులో వెళ్తున్న కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి దృష్టికి వీధి దీపాల సమస్యలను తీసుకెళ్లగా అక్కడా అదే సీను రిపీట్ అయ్యింది. దాంతో ఓట్ల కోసమే తమ అవసరం పడుతుందని, పదవులు వచ్చాక ప్రజాప్రతినిధులు కనీసం కారు దిగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని స్థానికులు ఆయా ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

కార్పొరేటర్ విజయారెడ్డికి వీధి దీపాల సమస్యను వివరిస్తున్న డబుల్ బెడ్రూమ్ ఇండ్ల యజమానులు(ఫైల్)

ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు గోడు వెల్లబోసుకుంటున్న డబుల్ బెడ్రూమ్ ఇండ్ల యజమానులు(ఫైల్)

ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించే స్థాయికి ఎదగాలి

- ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ రమణాచారి

కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రమణాచారి

ఖైరతాబాద్, జనవరి 5 : తెలుగు వెలుగు సమాఖ్య కార్యక్రమాలను నిరంతరాయంగా నిర్వహిస్తూ భవిష్యత్‌లో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించే స్థాయికి యువభారతి సాహితీ సంస్కృతిక సంస్థ ఎదగాలని ప్రభుత్వ మాజీ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, సత్కళాభారతి సంయుక్తాధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో 'తెలుగు-వెలుగు' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సత్కళాభారతి వ్యవస్థాపక అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రముఖ నాటక రచయిత, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్, 'యువభారతి' అధ్యక్షుడు ఆచార్య ఫణీంద్రతో కలిసి మాట్లాడారు. నేటి యువతకు తెలుగు భాషపై మక్కువ తగ్గుతుందని, ఏఐ రావడంతో పిల్లల్లో ఆలోచించే నైపుణ్యం లోపించిందన్నారు. ప్రొఫెసర్ వంగపల్లి విశ్వనాథం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

జెన్కో మాజీ సీఎండీతో నాయకుల భేటీ

ఎర్రగడ్డ, జనవరి 5: తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్కో మాజీ సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావును ఆదివారం ఆయన నివాసంలో విద్యుత్ ఉద్యోగుల సంఘం-1535 నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపి విద్యుత్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పడిన విషయాన్ని ప్రస్తావించారు. సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎంఏ వజీర్, ఉపాధ్యక్షుడు సిర్ర ఆనంద్‌కుమార్, టీజీ ట్రాన్స్‌కో అధ్యక్షుడు కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, కీర్తి శ్రీనివాస్, అబ్దుల్‌ఖాదర్, రామకృష్ణరాజు తదితరులు ప్రభాకర్‌రావును కలిసిన వారిలో ఉన్నారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

హిమాయత్‌నగర్, జనవరి 5: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు నెర్లకంటి శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో రంగారెడ్డి జిల్లా ఏఐవైఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం యువతను పట్టించుకోకపోవడంతో మత్తు పదార్థాలకు బానిసలై వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువతలో మార్పులు తీసుకువచ్చేందుకు సదస్సులు, అవగాహన కార్యక్రమాలు చేసి వారిలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐవైఎఫ్‌ను మరింత బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. విద్య,వైద్య,ఉపాధి హక్కుల సాధన కోసం ఉద్యమించాలని యువతకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శివకుమార్‌గౌడ్, నాయకులు జెట్టి శ్రీనివాస్,వెంకటేశ్, శివకుమార్, వీరేశ్, భానుప్రకాశ్, స్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- శంషాబాద్ పట్టణంలో మున్సిపల్ కార్మికుల ఆందోళన

శంషాబాద్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

శంషాబాద్ రూరల్, జనవరి 5 : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైయిందని పలువురు కార్మిక నాయకులు అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఆదివారం శంషాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మున్సిపల్ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వానికి అనుకులంగా ఉన్న వారికి కోట్ల రూపాయల ఆస్తులు కట్టబెడుతున్న ప్రభుత్వం కార్మికులకు వేతనాలు ఇవ్వడంలో ఎందుకు స్పందించడంలేదని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్ల నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు ప్రవీణ్, సలహాదారు నాగేశ్, జయేందర్, యాదమ్మ, సుజాత, ఇందిర, రవి, రాజు, తదితర కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

క్రీడోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 5: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు సమయాన్ని వెచ్చించాలని రాజేంద్రనగర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు ఎం.ప్రభాకర చారి, ప్రధాన కార్యదర్శి జి.శవరణ్‌కుమార్ అన్నారు. అత్తాపూర్ గురునానక్ పాఠశాలలో 8 రోజులుగా కొనసాగుతున్న క్రీడోత్సవాల్లో భాగంగా ఆదివారం ఫ్యాన్సీడ్రెస్, డ్రాయింగ్, పెయింటింగ్, వ్యాసరచన, రన్నింగ్, క్యారమ్స్, చెస్, స్పెల్ బీ, అథ్లెటిక్స్, షాట్‌పుట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు.

కార్యక్రమంలో సంఘం కోశాధికారి రజనీకాంత్, బోయ లక్ష్మణ్, యాదగిరి, సంజీవ, ఏపీ చారి, కరుణాకర్, వాజిద్, మనోహర్, సందీప్, శేషు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బహుజన సాహిత్యం ద్వారానే రాజ్యాధికారం

చిక్కడపల్లి, జనవరి 5: బహుజన సాహిత్యం ద్వారానే రాజ్యాధికారం సాధ్యమని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమీ 7వ తెలంగాణ రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హుజూరాబాద్ సెంకడ్‌క్లాస్ స్పెషల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ తాటిపల్లి ఈశ్వర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. బహుజన సాహిత్యం ద్వారానే ప్రజల్లో రాజ్యాధికార చైతన్యాన్ని నింపవచ్చునన్నారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎం గౌతమ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అకాడమీ నాయకులు ఎర్రగుండ్ల వెంకటేశ్వర్, హెచ్ విష్ణు, డాక్టర్ కొట్ర బాలయోగి, మట్ట ప్రభాత్‌కుమార్, కేటీ షాజీ, మాంమిడ్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జహీరోద్దీన్

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 5 : ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తామని బీఆర్ఎస్ సులేమాన్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు ఎండీ జహీరోద్దీన్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అత్యంత వెనుకబడిన, ప్రధానంగా పేద ముస్లింలు ఉన్న సులేమాన్‌నగర్ డివిజన్‌లో పలు కాలనీల్లో డ్రైనేజీ, పారిశుధ్యం అధ్వానంగా మారిందని అన్నారు. సమీపంలోని మిరాలం ట్యాంక్‌లో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో విష సర్పాలు చేరుతున్నాయని, దోమలు వ్యాప్తి చెంది దుర్వాసన వెదజల్లుతుందని పేర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట డివిజన్ నాయకులు సయ్యద్ అమీర్, అబ్దుల్ రెహమాన్, ఇబ్రహీం, రవి తదితరులు ఉన్నారు.

మెకానిక్ షెడ్‌లో అగ్ని ప్రమాదం

ఫైరింజిన్ సాయంతో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 5: ప్రమాదవశాత్తు ఓ మెకానిక్ షెడ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. బుద్వేల్ రైల్వే స్టేషన్ సమీపంలో లారీ మెకానిక్ షెడ్‌లో ఆదివారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విషయాన్ని గమనించి స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకోని మంటలను ఆర్పివేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటు చేసుకొని ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో స్వల్ప ఆస్తినష్టం జరిగినట్లు తెలుస్తున్నది.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- ఈనెల 22న ఇందిరా పార్కు వద్ద ధర్నా
- విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి

పెన్షనర్లతో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు

ఎర్రగడ్డ, జనవరి 5: తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తాము కట్టుబడి ఉంటామని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డి అన్నారు. సంఘం రాజీవ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించిన అఖిల భారత పెన్షనర్ల దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పెన్షనర్లకు ఈహెచ్ఎస్ వైద్య సదుపాయాన్ని కల్పించాలని ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల సాధనకు ఈనెల 22న ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. ధర్నాకు పెన్షనర్లు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘం నాయకులు సీహెచ్ చంద్రశేఖర్, ఠాకూర్ ఇందర్‌సింగ్, సహాయ పెన్షన్ చెల్లింపు అధికారి(పంజాగుట్ట) వీఆర్ శివకుమార్ హాజరయ్యారు. రాజీవ్‌నగర్ శాఖ అధ్యక్షుడు పీఎస్‌జీ కృష్ణశర్మ ఆధ్వర్యంలో పలువురు సీనియర్ పెన్షనర్లను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా శాఖల నాయకులు శ్యామ్‌రావు,వెంకట్‌రెడ్డి, భుజంగరావు, విజయానంద్, బద్రుద్దీన్ పాల్గొన్నారు.

పుట్‌పాత్‌పై ట్రాన్స్‌ఫార్మర్ గద్దె ఏర్పాటు

గతంలో కూల్చిన చోట పుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ గద్దె

ఖైరతాబాద్, జనవరి 5 : ఖైరతాబాద్ డివిజన్‌లోని గాంధీతాతనగర్ ప్రధాన రహదారిలో అపార్ట్‌మెంట్ కోసం పుట్‌పాత్‌పై ట్రాన్స్‌ఫార్మర్ గద్దెను ఏర్పాటు చేశారు. గత ఏడాది అదే చోట గద్దెను నిర్మించగా జీహెచ్ఎంసీ, పోలీస్, విద్యుత్‌శాఖ అధికారులు కూల్చివేశారు. తిరిగి మళ్లీ అదే ప్రాంతంలో గద్దె నిర్మించారు. దీనిపై ఆయా శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బస్తీకి చెందిన పలువురు పేర్కొంటున్నారు. తక్షణమే ఆ గద్దెను కూల్చివేయాలని కోరారు. అధికారుల నిర్లక్ష్యం, అలసత్వ వల్లే కూల్చివేసినా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్, జనవరి 5: రాష్ట్రంలోని వైద్య రంగంలో ఎన్‌హెచ్ఎం స్కీమ్ కింద పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ.. ఎన్‌హెచ్ఎం స్కీమ్‌లో 25 ఏండ్లుగా 17వేల మంది వివిధ కేటగిరిల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారన్నారు. వీరికి ప్రభుత్వ ఉద్యోగుల బేసిక్ వేతనం ఇవ్వాల్సి ఉండగా ప్రభుత్వం అమలు చేయకుండా అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. అనంతరం యూనియన్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామరాజేశ్‌ఖన్నా, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, జి.జ్యోతి, కవిత, నరసింహ, సుమన్, ఉప్పలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 5: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్ కల్లు కంపౌండ్ ప్రాంతంలో ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా సుమారు 40-45 సంవత్సరాల వ్యక్తి మృతిచెంది కనిపించాడన్నారు. మృతుడికి సంబంధించి ఎలాంటి వివరాలు లభించలేదన్నారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చరీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి సంబంధీకులు 9490617459, 9490617267 నంబర్లలో సంప్రదించాలన్నారు

అనుమతి లేని సెల్ టవర్ సీజ్

జియో సెల్ టవర్‌ను సీజ్ చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారి నరేశ్, న్యాక్ ఏఈ మౌనిక

జూబ్లీహిల్స్,జనవరి 5 : జనావాసాల మధ్య అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను యూసుఫ్‌గూడ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆదివారం సీజ్ చేశారు. రహ్మాత్‌నగర్ డివిజన్ హబీబ్ ఫాతిమానగర్ 127 సర్వే నంబర్‌లో ఇటీవల జియో సెల్ టవర్ ఏర్పాటు చేశారు. ఈ సెల్ టవర్ ఏర్పాటుకు ఎస్‌డీఐ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ నగర పాలక సంస్థకు దరఖాస్తు చేసుకోగా స్థానికుల అభ్యంతరాల మేరకు జీహెచ్ఎంసీ అనుమతి నిరాకరించింది. అయినా పట్టించుకోకుండా సెల్ టవర్ నిర్మించి గత కొంతకాలంగా కొనసాగుతున్నది. ఈ విషయమై వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ అసోసియేషన్ మరొకమారు ఫిర్యాదు చేయడంతో జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. బేఖాతర్ చేయడంతో టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణవేణి ఆధ్వర్యంలో సిబ్బంది సెల్ టవర్‌ను సీజ్ చేశారు. సెక్షన్ ఆఫీసర్ జి.నరేశ్, న్యాక్ ఏఈ మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తున్న వారిపై కేసు

బంజారాహిల్స్, జనవరి 5 : పర్యావరణానికి ప్రమాదమైన నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తున్న వారిపై జూబ్లీహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకృష్ణానగర్‌లో కొంతమంది చిరువ్యాపారులు సంక్రాంతి సందర్భంగా చైనా మాంజాను విక్రయిస్తున్నారని సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు సోదాలు నిర్వహించారు. ముగ్గురు వ్యాపారుల వద్ద పోలీసులు నిషేధిత మాంజాను స్వాధీనం చేసుకున్నారు. బేగంపేటలోని బాబా కైట్స్ అనే షాపు నుంచి తాము చైనా మాంజా కొనుగోలు చేసినట్లు నిందితులు వీ.ప్రవీణ్, సాయి ప్రణీత్, డి.జస్వంత్ తెలిపారు. వారిపై బీఎన్ఎస్ 125, 223 సెక్షన్‌తో పాటు పర్యావరణ పరిరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిబంధనలను విధిగా పాటించండి

అమీర్‌పేట్, జనవరి 5: రోడ్లపై వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించే వీలుందని విశ్వమానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పెసల మస్తాన్‌రావు పేర్కొన్నారు. సంఘం అధ్యక్షుడు వెంకట్ సోమ, ప్రతినిధులతో కలిసి ఆదివారం ఎర్రగడ్డ చౌరస్తాలో సంఘం ప్రతినిధులు బ్యానర్లు ప్రదర్శనతో వాహనదారులకు అవగాహన కల్పించారు. రెడ్ సిగ్నల్ ఉన్నా పాటించకుండా దూసుకొస్తున్న వాహనాల వల్ల పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకుని వాహనాలు నడపాలని వారు సూచించారు. కార్యక్రమంలో సంఘం ముఖ్య కార్యదర్శి టీఎస్పీ ఆంజనేయులు, కోశాధికారి ఎండీ ఇబ్రహీం, ఉప కార్యదర్శి డీఎస్ రావు, ఈసీ సభ్యులు వి.సుదర్శన్‌రావు, భానోజీరావు, రాజారావు, గోపాలకృష్ణన్, కాశీ విశ్వనాథ్, దామోదర్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ మహిళల నుంచి దరఖాస్తులు

జూబ్లీహిల్స్,జనవరి 5 : క్రైస్తవ మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి పథకంలో భాగంగా కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నట్లు తెలంగాణ క్రిష్టియన్(మైనార్టీ) ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి ఈనెల 20 వరకు క్రైస్తవ మహిళలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపిచాలని.. అర్హులైన వారికి కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 040-23391067 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

షేక్ సైరాభాను

ఎర్రగడ్డ, జనవరి 5: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన బోరబండ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల తెలిపిన ప్రకారం వివరాలు.. బోరబండ సైట్-1 కాలనీకి చెందిన షేక్ సైరాభాను(56) ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఈమె కోసం కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికిన ప్పటికీ ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా సైరాభాను మానసిక పరిస్థితి సరిగ్గా లేదని, ఉర్దూ, తెలుగు, హిందీ భాషలు మాట్లాడుతుందని పోలీసులు పేర్కొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు

సికింద్రాబాద్, జనవరి 5: వారాసిగూడ మహిళా సంఘం ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం కనుల పండువగా జరిగాయి. పోటీల్లో గంగపుత్ర మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పాల్గొన్నారు. నామాలగుండులోని గంగపుత్ర వెల్ఫేర్ సొసైటీ భవనంపై మహిళలు ముగ్గులను ఆవిష్కరించారు. పోటీల్లో విజేతలతో పాటు చూడటానికి వచ్చిన మహిళలకు నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు రాచమల్ల స్వర్ణలత, నా